సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

పచ్చదనంపై వేటు

ఇష్టానుసారం చెట్ల నరికివేత

- జోనల్ ఆఫీసు ఎదురుగానే 4 చెట్లు తొలగింపు
- మాస్టర్ ప్లాన్ రోడ్లలో ఎక్కువగా ధ్వంసం
- పట్టించుకోని అధికారులు



మధురవాడ జోనల్ కార్యాలయం ఎదురుగా ఇటీవల రాత్రి వేళ నరికిన చెట్లు



సాయిరాం కాలనీ సచివాలయం వద్ద చెట్టు నరికివేయడంతో మిగిలిన మోడు

మధురవాడ: పర్యావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న తరుణంలో మానవాళిని సంరక్షించేది పచ్చని చెట్లే. పచ్చదనాన్ని పదిలంగా కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యం. కానీ, జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లోని వివిధ ప్రాంతాల్లో పచ్చదనంపై జరుగుతున్న దాడి అటు స్థానికులను, ఇటు పర్యావరణ ప్రేమికులను కలవరపెడుతోంది. పచ్చదనాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అధికారులు సైతం దీనిని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చెట్టు తొలగించాలంటే..

సాధారణంగా చెట్టు తొలగించాలంటే డీఎఫ్‌వో స్థాయిలో అనుమతులు రావాలి. జీవీఎంసీ ఉద్యానవన శాఖాధికారులు, ఇతర అధికారులు కొమ్మల తొలగింపు వరకు మాత్రమే అనుమతి ఇవ్వగలరు. అది కూడా నిబంధనల ప్రకారం కమిషనర్‌కు దరఖాస్తు చేసుకుంటే ఉద్యానవన శాఖ అధికారుల నివేదిక ఆధారంగా తొలగింపునకు అనుమతి ఇస్తారు. ఒక చెట్టు తొలగించాలంటే ఇంత ప్రక్రియ ఉంటుంది. కానీ, కొందరు ఏ అనుమతి లేకుండా ఇష్టానుసారం చెట్లు కొట్టేయడంపై పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చాలా పెద్ద నేరం

చెట్లను నరకడం చాలా పెద్ద నేరం. చెట్ల పరిరక్షణ బాధ్యతలను వార్డు సచివాలయ ఎమినిటీ, శానిటరీ, ప్లానింగ్ సెక్రటరీలు చూడాలి. వాటిని కొట్టేవారిపై చర్యలు చేపట్టాలి. ఇలాంటివి జరిగినప్పుడు కమిషనర్ ద్వారా పైఅధికారుల దృష్టికి వచ్చేలా చూడాలి. అలాగే ఇలా చెట్లు కొట్టడం నేరమన్న విషయంపై విస్తృతంగా అవగాహన కల్పించాలి. అందిన సమాచారం ప్రకారం పరిశీలన చేసి బాధ్యులపై జోనల్ కమిషనర్ ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

–దామోదర్, ఉద్యానవనశాఖ అధికారి, జీవీఎంసీ

ఇదీ పరిస్థితి

- జీవీఎంసీ జోన్–2 కేంద్రం మధురవాడ జోనల్ ఆఫీసు ఎదురుగా దేవదాయ శాఖ భూమిలో ఉన్న కొన్ని భారీ చెట్లు సందర్శకులకు నీడనిస్తున్నాయి. కాని వీటిపై నుంచి పాములు పడుతున్నాయనే నెపంతో ఇటీవల కొందరు రాత్రికి రాత్రి ఏకంగా 4 చెట్లు కొట్టేశారు. ఎప్పుడు కొట్టారో తెలియకుండా సున్నం పూసేశారు.
- జీవీఎంసీ 6వ వార్డు సాయిరాం కాలనీ వార్డు సచివాలయం వద్ద కూడా పెద్ద చెట్టును కొట్టేయడంతో మోడు దయనీయంగా దర్శనమిస్తోంది.
- మిథిలాపురి వుడా కాలనీలో ఎవరి భూమికి చెట్లు అడ్డుగా ఉంటే వారు ఇష్టానుసారం కొట్టేస్తున్నారు. గతంలో కొందరు చెట్లు కొట్టి దొరికిపోగా, జీవీఎంసీ అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకుని, చేతులు దులిపేసుకున్నారు. దీంతో చాలామంది ఇదే తీరున వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల చెట్ల మోడులు కనిపిస్తుండగా.. మరి కొన్నిచోట్ల వాటినీ మాయం చేస్తున్నారు.
- కొమ్మాది, శివశక్తి నగర్ రోడ్డు, బక్కన్నపాలెం, మారికవలస–తిమ్మాపురం, పీఎం పాలెం, లా కళాశాల రోడ్డులో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక సచివాలయ కార్యదర్శులు తమకు సంబంధం లేని విషయంగా భావిస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులైనా స్పందించి, చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కమనీయం.. లక్ష్మీనారాయణుల కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

మధురవాడ: మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠం స్వర్ణోత్సవాల్లో భాగంగా గురువారం చండీయాగం నిర్వహించారు. ధర్మకర్త నరసింహమూర్తి, ఇతర కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు రామలింగస్వామి శర్మ భక్తులతో శాస్త్రోక్తంగా యాగం చేయించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పీఠంలో సాయంత్రం లక్ష్మీనారాయణుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు.

ఘనంగా సత్యసాయి వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న మహిళలు

భీమునిపట్నం: భీమిలిలోని భగవాన్ సత్యసాయి సేవా సమితిలో గురువారం సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహించారు. సత్యసాయిబాబా జయంత్యుత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్రతాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సమితి జిల్లా కో–ఆర్డినేటర్ సూర్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. వ్రతం అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

భీమునిపట్నం: భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ గురువారం తెలిపారు. మూడు నెలల శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందిస్తారన్నారు. వివరాల కోసం స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ అన్నపూర్ణను 90147 58949 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కార్మిక నాయకుడు శంకరరెడ్డికి నివాళులు



చిల్లపేటలో శంకరరెడ్డికి నివాళులు అర్పిస్తున్న స్థానికులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికుడు, భీమిలి మున్సిపాల్టీ కౌన్సిలర్ చిల్ల శంకరరెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు యూనియన్ నాయకులు పేర్కొన్నారు. శంకరరెడ్డి వర్ధంతి సందర్భంగా చిల్లపేటలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. మిల్లు లాకౌట్‌కు సంబంధించి యాజమాన్యంతో జరిగిన పోరాటాలలో అనేకమార్లు జైలుకు కూడా వెళ్లారని గుర్తు చేసుకున్నారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో నీలాపు శంకరరెడ్డి, జీరు కైలా సరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, ఆదినారాయణ రెడ్డి తదితరులున్నారు.

వీఆర్‌ఏపై దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక ఇటీవల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుండగా అడ్డుకున్న వీఆర్‌ఏ ఆనందరావుపై దాడి చేసిన నిందితులను శిక్షించాలని గ్రామస్తులు, నియోజకవర్గ వీఆర్‌ఏలు డిమాండ్ చేశారు. పంచాయతీలో ఒక వార్డు సభ్యుని కుమారులు యంత్రాలతో చదును చేస్తుండగా ఆనందరావు అభ్యంతరం తెలియజేశారు. దీంతో వారు వీఆర్‌ఏను ఈడ్చుకుంటూ, కొట్టుకుంటూ దూరంగా తీసుకుని వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు ఆనందపురం తహసీల్దార్, ఆర్‌ఐలకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను రక్షించే వీఆర్‌ఏలపై దాడులకు పాల్పడే వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆనందరావు ప్రాణానికి రక్షణ కల్పించాలని కోరారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
✆ 9493185214

మత్స్యకారుల హక్కుల సాధనకు పోరాడాలి

- రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలా గురువులు
- ఘనంగా మత్స్యకార దినోత్సవం



మత్స్యకారులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కోలా గురువులు తదితరులు

కొమ్మాది: మత్స్యకారుల హక్కుల సాధనకు సమష్టిగా పోరాడాలని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలా గురువులు కోరారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని 4వ వార్డు చేపలుప్పాడ పరిధి చొక్కవానిపాలెంలో ఉత్తరాంధ్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోస్తా 9 జిల్లాల్లో మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని దశాబ్దాలుగా పోరాడుతున్నా, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఐక్యతతోనే హక్కులను సాధించుకోగలమని, పార్టీలకు అతీతంగా మత్స్యకార సోదరులందరూ ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, మత్స్యకార నాయకులు పేర్ల విజయచందర్, సంఘం అధ్యక్షుడు చొక్కా భాస్కర్రావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను మోసం చేసిన ‘కూటమి’

మత్స్యకారులకు వేట విరామ భృతి రూ. 20 వేలు ఇస్తామని నమ్మించి కూటమి ప్రభుత్వం మత్స్యకారులను మోసం చేసిందని కార్పొరేటర్, మత్స్యకార నాయకుడు దొలపల్లి కొండబాబు అన్నారు. చేపలుప్పాడలో ఆక్వా మెరైన్ ఫిషర్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మత్స్య కార దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వరుస తుపానులతో మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు న్నారని, ఆదుకోవాల్సిన ప్రభుత్వం మత్స్యకారులతో ఆడుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల్లో మత్స్యకారులకు వేట విరామ భృతి అందించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులంతా ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న కోలా గురువులు

భీమునిపట్నం: ఐక్య పోరాటాలతోనే విజయం సొంతమవుతుందని మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. మత్స్యకారులందరూ కలసికట్టుగా పోరాడటం హర్షణీయమని, న్యాయం జరిగేవరకు దీనిని కొనసాగించాలని సూచించారు. ఆక్రమణలపై మత్స్యకారులు వారం రోజులుగా నిర్వహిస్తున్న రిలే దీక్ష శిబిరానికి గురువారం ఆయన విచ్చేసి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారుల శ్మశానవాటిక ప్రాంతాన్ని ఆక్రమిస్తుండటం చాలా దారుణమన్నారు. భీమిలి తీర ప్రాంతంలో జరుగుతున్న ఆక్రమణల వల్ల నష్టపోతున్న మత్స్యకారులకు న్యాయం జరిగే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఆక్రమణదారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీక్షల్లో మత్స్యకార నాయకులు గంటా నూకరాజు, అల్లిపిల్లి నర్సింగరావు, వాసుపల్లి గరగయ్య, కారి చిన్నారావు, దూడ నూకరాజు, వాసుపల్లి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్ట్



పేకాడుతున్నవారికి అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని గురువారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక్కడ బీచ్ బస్టాప్ వెనుక వైపు ఇసుకలో కొందరు పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన సీఐ బొడ్డేపల్లి సుధాకర్ తన సిబ్బందితో వెళ్లి, అక్కడ పేకాడుతున్న భీమిలికి చెందిన ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ. 1,610 స్వాధీనం చేసుకున్నారు.

4వేల మందికి అన్నసమారాధన



ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం ఆవరణలో పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆకెళ్ల భాగ్యరాజా శర్మ, రవిగణేష్ శర్మ ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన ఓరుగంటి రవిశర్మ శాస్త్రోక్తంగా ఆది దంపతుల కల్యాణం జరిపించారు. భక్తులకు ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆలయం ముందు భారీ అన్నసమారాధన చేశారు. సుమారు 4వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

యాంటిబయోటిక్స్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి



ప్రసంగిస్తున్న డా.శ్యామ్ కుమార్

కొమ్మాది: యాంటిబయోటిక్స్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని ఫార్మకాలజీ నిపుణుడు డా.ఎ. శ్యామ్ కుమార్ సూచించారు. అవసరానికి మించి వినియోగించడం వలన ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. యాంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గీతంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. యాంటీ బయోటిక్స్ వినియోగంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు విశాఖ చేరుకోనున్న ‘జాగృతి’ ప్రతినిధులు

గంభీరంలో అక్షయపాత్ర వంటశాల సందర్శన

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని అక్షయపాత్ర ఫౌండేషన్ వంటశాలను జాగృతి సేవాసంస్థ ప్రతినిధులు శుక్రవారం సందర్శించనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన, పారిశ్రామిక రంగంలో ఆసక్తి కలిగిన 550 మంది యువతీయువకులతో పాటు 14 దేశాలకు చెందినవారు ఈ జాగృతి యాత్రలో పాల్గొంటున్నారు. ఈ నెల 16న ముంబయిలో ప్రారంభమైన యాత్ర 18 బోగీలు గల ప్రత్యేక ట్రైన్‌లో 12 మహానగరాలను సందర్శించనుంది. శుక్రవారం ఈ ట్రైన్ విశాఖ చేరుకోనుంది. అక్కడి నుంచి బస్సుల్లో వీరంతా గంభీరం రానున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి పి.రామ్మోహన్ తెలిపారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విశాఖ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గంభీరం ఏపీఐఐసీ, వెల్లంకి, బొడ్డపాలెం, గారిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

పద్మనాభం: రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎంపీఎస్ చలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరులోగా రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. సాధారణ రకాలు 1121, సంపత్ స్వర్ణ వంద కిలోలకు రూ. 2300, గ్రేడ్ ఏ రకాలు సాంబ మసూరి, స్వర్ణలకు వంద కిలోలకు రూ.2320 మద్దతు ధర చెల్లిరచనున్నట్లు తెలిపారు. తేమ 17 శాతం లోపు ఉండాలని పేర్కొన్నారు. ఈ–పంట నమోదు చేసుకుని, ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతులు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో విక్రయించవచ్చని తెలియజేశారు.

మద్దిలపేటలో పశు వైద్య శిబిరం

తగరపువలస: శింగనబంద పంచాయతీ మద్దిలపేట గ్రామంలో పశువులలో గర్భకోశ వ్యాధి నివారణకు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 54 మంది రైతులకు చెందిన 74 పశువులు, దూడలకు చికిత్స అందించారు.పశు సంవర్ధకశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, భీమిలి ఏడీ వెంకటరమణ, మజ్జి వెంకటరమణ, జెడ్పీటీసీ వెంకటప్పడు, పశు వైద్యులు కాంతికిరణ్, సౌజన్య, ప్రశాంతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అనంతుని దీపోత్సవానికి ప్రచారం కరువు

పద్మనాభం: రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి ఈ ఏడాది ప్రచారం కరువైంది. దీంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతుని గిరి మెట్ల పంక్తిపై ప్రతి ఏడాది కార్తీక బహుళ అమావాస్య రోజున సాయంత్రం దీపోత్సవం జరుగుతుంది. ఈ ఏడాది ఈ నెల 30న దీపోత్సవం జరగనుంది. ఏటా దీపోత్సవం నిర్వహణపై నెల రోజుల ముందుగా విద్యుత్, అగ్నిమాపక, 108, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించేవారు. 20 రోజుల ముందుగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించేవారు. పోస్టర్లను గోడలపై అంటించి, విస్తృత ప్రచారం చేసేవారు. ఈ ఏడాది దీపోత్సవానికి ఇంకా ఎనిమిది రోజులు మాత్రమే ఉంది. ఇంతవరకు అధికారులు, పాలకులు ఎటువంటి సమన్వయ సమావేశాలు నిర్వహించలేదు. పోస్టర్లతో ప్రచారమూ చేపట్టలేదు. దీనిపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గ్రావెల్ మాఫియాపై ఆర్డీవో సీరియస్

- తవ్వకాలు జరిగిన కొండల పరిశీలన
- పటిష్ట చర్యలు తీసుకుంటామని వెల్లడి

సాక్షి ఎఫెక్ట్..



గ్రావెల్ తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సంగీత్ మాథుర్

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం పరిధి ఎస్సీ కాలనీ సమీపంలో, కాపులుప్పాడ పరిధిలో కొండలను తవ్వి గ్రావెల్‌ను అక్రమంగా తరలించడంపై ఆర్డీవో సంగీత్ మాథుర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాల్లో పలు చోట్ల గ్రావెల్ తవ్వి, రాయిని యథేచ్ఛగా తరలించడంపై ‘కరిగిపోతున్న కొండలు’ శీర్షికతో సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనంపై ఆర్డీవో స్పందించారు. వెంటనే అక్కడి కొండలను పరిశీలించి, ఆశ్చర్యానికి గురయ్యారు. భారీ స్థాయిలో కొండల తవ్వకాలు జరుగుతున్నా, రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పట్టపగలే కొండలు తవ్వి లారీలు, మినీ లారీలపై గ్రావెల్‌ను తరలిస్తుంటే వాహనాలు సీజ్ చేసి, కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఇకపై ఈ కొండ ప్రాంతాల నుంచి ఒక్క రాయి కూడా బయటకు పోకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నిఘా ఏర్పాటు

ఎస్సీ కాలనీ కొండపై, తిమ్మాపురం మారికవలస వెళ్లే మార్గమధ్యలో కొండ వద్ద, కళాగ్రామం కొండల సమీపంలో రెవెన్యూ అధికారులతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో తెలిపారు. ఎవరైనా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తే తమకు వెనువెంటనే ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

తిమ్మాపురం అక్రమ నిర్మాణాలపై దృష్టి

జీవీఎంసీ 4వ వార్డు భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలో లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన తిమ్మాపురంలో ఆక్రమణల పర్వం కథనంపై ఆయన స్పందించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, హెచ్చరిక బోర్డుల తొలగింపు వంటి సంఘటనలు తమ దృష్టికి వచ్చాయని, పూర్తి స్థాయిలో పరిశీలించి ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు పరిశీలించి, స్వాధీనం చేసుకుంటామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిరిజనులు హక్కులను వినియోగించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఈడీ రాణి తదితరులు

కొమ్మాది: గిరిజనులు తమ జీవన విధానాన్ని.. సంప్రదాయ భూములు, భూ భాగాలు, సహజ వనరులపై తమ హక్కులను వినియోగించుకోవాలని టీసీఆర్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.రాణి మందా సూచించారు. రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణా మిషన్ (టీసీఆర్‌టీఎం) భవన్‌లో నిర్వహిస్తున్న జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా గురువారం నిర్వహించిన ‘భారతదేశంలో యుగాల ద్వారా గిరిజన చట్టం, ఆచారాలు, న్యాయవ్యవస్థ’ అనే అంశంపై ఆమె ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తున్న చట్టాల గురించి వివరించారు. గిరిజనుల రక్షణ, మాతృభాషలో బోధనతో సహా విద్య, సంస్కృతి, రక్షణలపై ఎక్కువగా దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి, సదస్సు కో–ఆర్డినేటర్ డా.పి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటల గట్లపై మొక్కలు నాటాలి

ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్



కణమాంలో నీటి కుంటలు పరిశీలిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ వైవీకే షణ్ముఖ కుమార్

మధురవాడ: ఉపాధి హామీ పనుల్లో నీటి కుంటలు నిర్మించడంతో పాటు, వాటి గట్ల మీద మొక్కలు నాటి సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ వైవీకే షణ్ముఖ కుమార్ సూచించారు. గురువారం ఆయన ఆనందపురం మండలంలోని కణమాం, శొంఠ్యాం గ్రామ పంచాయతీలను సందర్శించి, అక్కడి ఉపాధి పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా ఊట కుంటలు, అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ వర్క్, మినీ అమృత సరోవర్ చెరువు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, ఎంపీడీవో జానకి, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ‘దివీస్’ ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో దివీస్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం 112 మంది విద్యార్థులకు రూ.7.69 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేసింది. 8వ తరగతి నుంచి పీజీ వరకు ప్రతిభ చూపిన పెద నాగమయ్యపాలెం, తూడెం, చెరకుపల్లి, అన్నవరం, టి.నగరపాలెం, చిప్పాడ, లింగాలవలస, గుడివాడ, మూలకుద్దు తదితర పంచాయతీలకు చెందిన విద్యార్థులకు వీటిని అందజేశారు. ప్లాంట్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఎస్.దేవేందర్, వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎల్.వి.రమణ, జనరల్ మేనేజర్లు ఎం.ఎస్.ఎన్.రావు, ఇ.రామకృష్ణ, వైఎస్ కోటేశ్వరరావు, మార్కెటింగ్ జనరల్ మేనేజర్ నాయుడు తదితరులు విద్యార్థులకు చెక్కుల రూపంలో వీటిని అందించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, శ్రీనివాస్, నరసింహ, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల హామీ అమలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, ప్రజలు

మధురవాడ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగిపోయినందున గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం హామీలను అమలు చేయాలని కోరుతూ పాత మధురవాడ నుంచి వార్డు సచివాలయం వరకు ప్లకార్డులు, బ్యానర్లు, జెండాలు పట్టుకుని గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అధిక ధరలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం 53వ వార్డు సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఏరియా నాయకులు వి.సత్యనారాయణ, ఎండీ బేగం, కె.కుమార్, ఎంఎస్ పాత్రుడు, ఎన్.త్రినాథ్, కె.చిన్న, రమ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం





భీమిలిలోని సుభాష్ వీధిలో విద్యుత్ స్తంభాలు, గోడలపై అల్లుకుపోయిన లతలు

తగరపువలస: భీమిలి పట్టణాన్ని తుప్పలు, తీగెజాతి మొక్కలు కమ్మేస్తున్నాయి. ఇళ్లతో సమానంగా ఖాళీ స్థలాలు ఉండటంతో, వాటిలో పనికిరాని మొక్కలు పెరిగి తుప్పలుగా మారుతున్నాయి. తీగె జాతి మొక్కలు విద్యుత్ స్తంభాలతో పాటు ఇళ్లపైకి పాకుతున్నాయి. దీంతో విషపురుగుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సుభాష్‌రోడ్డు, సీబీఎం రోడ్డు, పాత పోస్టాఫీసు వీధి, 108 ద్వారాల వీధిలో ఎటువైపు చూసినా తుప్పలు, మొక్కలే. వీటిని ఆవాసంగా చేసుకున్ని పెరిగిపోతున్న విషపురుగులు పట్టపగలే ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ఇక చీకటి పడితే కాళ్ల కింద నుంచి పాకుతున్నాయి. పలువురు వీటి బారి నుంచి తృటిలో తప్పించుకున్న ఘటనలూ ఉన్నాయి.

ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా..: నెలరోజుల క్రితం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇక్కడి ప్రజల తరఫున విశ్రాంత ప్రిన్సిపాల్ కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఈ తుప్పలపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఆదేశించినా ఇక్కడి అధి కారులలో చలనం లేకుండా పోయింది. ప్రభుత్వ స్థలాలలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది, ప్రైవేట్ స్థల యజమానులకు నోటీసులు ఇస్తే వారు తుప్పలు తొలగించాలి. అయినా ఎలాంటి చర్యలు లేవు. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని స్థానికులు అంటున్నారు.



భీమిలి పెట్రోల్ బంక్ పక్క రహదారిని ఆనుకుని ఉన్న తుప్పలు